విలేఖర్లు కావలెను

జ్యోతి ప్రభంజనం దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జిల్లాలకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్ సి ఇన్చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను.

సంప్రదించ వలసిన నెంబర్:

7095999737,9908103501



PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:01 ఎడిటర్: రాపోలు లింగస్వామి 01 -09 -2026 మంగళవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00


## ఎడ్యుకేషన్ హబ్‌గా హుస్నాబాద్

సిద్దిపేట జిల్లా, ఆగస్టు 31: జిల్లాలోని హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన కొనసాగుతోంది. ఉమ్మాపూర్‌లో రూ. 7.28 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల బాలికలు, బాలుర నూతన హాస్టల్ భవనాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. హుస్నాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామన్నారు. వచ్చే సంవత్సరం ఆగస్టు లోపు ఇంజినీరింగ్ కళాశాలను పూర్తి చేసి జాతీయ జెండా ఎగరవేస్తామని చెప్పారు. తెలంగాణలోనే మొట్టమొదటిసారిగా ఇంటిగ్రేటెడ్ స్కూల్ హుస్నాబాద్ నియోజకవర్గంలోనే ఏర్పాటవుతుందని మంత్రి తెలిపారు. శాతవాహన యూనివర్సిటీ కళాశాలకు త్వరలో మరో రెండు బస్సులను తీసుకొస్తామని వెల్లడించారు. విద్యా ప్రమాణాలు బాగుంటేనే విద్యాసంస్థలు అభివృద్ధి చెందుతాయన్నారు. త్వరలో హుస్నాబాద్‌కు కబడ్డీ అకాడమిని తీసుకొస్తామన్నారు. సౌకర్యాలు మావి ర్యాంకులు తెచ్చే బాధ్యత మీది అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



తెలంగాణలో రైలు ప్రమాదాల నివారణకు 'కవచ్'

## రక్షణ వ్యవస్థను వినియోగిస్తున్నాం



జోగులాంబ వద్ద ఆర్వోబీకి రూ.45 కోట్లు తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్లు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గద్వాల: తెలంగాణలో రైల్వే మార్గాల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందనికేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కొత్త రైల్వే మార్గాలతో రైలు ప్రయాణాలు మరింత పెరిగే అవకాశం ఉందని తెలియజేశారు. జోగులాంబ గద్వాల జిల్లా పర్యటనలో ఉన్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి జోగులాంబ రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, అభివృద్ధి పనులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అమృత్ భారత్ పథకం కింద రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్లను అభివృద్ధికి గుర్తించగా, ఇప్పటికే 95 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. రైలు ప్రమాదాల నివారణకు 'కవచ్' రక్షణ వ్యవస్థను తెలంగాణలో వినియోగిస్తున్నామని, భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో దేశంలో ఏడు బుల్లెట్ ట్రైన్లు రానుండగా, అందులో మూడు తెలంగాణకు కేటాయించినట్లు కిషన్‌రెడ్డి వెల్లడించారు. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులకు సుమారు రూ.5 లక్షల కోట్ల నిధులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జోగులాంబ రైల్వే స్టేషన్ సమీపంలో రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.45 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, జడ్చర్ల రైల్వే స్టేషన్లను పరిశీలించనున్నట్లు తెలిపారు.

## చేయూత పెన్షన్ దరఖాస్తులకు 15 రోజుల గడువు పెంపు

చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం మరో 15 రోజుల పాటు పొడిగించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా మరి ముఖ్యంగా హైదరాబాదులో కొనసాగుతున్న సర్ ప్రత్యేక ప్రక్రియ కారణంగా పలువురు అర్హులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించలేక పోతున్నారని ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ముఖ్యంగా దివ్యాంగులు తమకు మరికొంత సమయం ఇవ్వాలని మంత్రి సీతక్కను కోరారు. ఈ విజ్ఞప్తులను సానుకూలంగా పరిగణించిన మంత్రి సీతక్క, అర్హులైన ప్రతి ఒక్కరూ కూడా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోకూడదని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి చేయూత పెన్షన్ దరఖాస్తుల గడువును మరో 15 రోజుల పాటు పెంచుతూ సెర్ప్ ఉత్తర్వులు జారీ చేసింది.దీంతో ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేక పోయిన అర్హులైన వితంతువులు,ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర అర్హత కలిగిన పేద కుటుంబాల వారు సెప్టెంబర్ 15 వరకు తమ దరఖాస్తులను సమర్పించుకునే అవకాశం లభించింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఒక ప్రకటనలో స్పందిస్తూ సామాజిక భద్రతా పెన్షన్లు పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసా అని అన్నారు. అర్హత ఉన్న ఒక్క పేదవాడు, దివ్యాంగుడు సమాచారం లేకనో, ఇతర కారణాల వల్లనో ప్రభుత్వ సంక్షేమ పథకానికి దూరం కాకూడదన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని




పేర్కొన్నారు. గడువు పెంపును దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు, సిబ్బంది దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ముఖ్యంగా దివ్యాంగులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారికి అవసరమైన సహాయం అందించాలని సూచించారు. సెప్టెంబర్ 15ను తుది అవకాశంగా భావించి, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన ప్రతి ఒక్కరూ చేయూత పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

## ఇంకెంత మంది ఆడబిడ్డలు బలైతే ప్రభుత్వం మేల్కొంటుంది



హైదరాబాద్, : తెలంగాణలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. తుక్కుగూడలో నర్స్ హత్య ఘటనపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆస్తులకే కాదని.. ప్రజల ప్రాణాలకు కూడా భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. గురుకులంలో చదివి, పేదరికాన్ని జయించి నర్సుగా సేవలందిస్తున్న ఆడబిడ్డ దారుణహత్యకు గురికావడం తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్య అనంతరం అత్యాచారం జరిగినట్లు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అరాచకాలు పెరిగి, శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. హోం శాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలో పరిస్థితులు ఇంత దారుణంగా మారుతుంటే ఏం చేస్తున్నారని నిలదీశారు. ఇంకెంత మంది ఆడబిడ్డలు బలైతే ప్రభుత్వం మేల్కొంటుందని హరీశ్ ప్రశ్నించారు. 'మహిళలకు భద్రత కల్పించలేని మీకు హోం శాఖ నిర్వహించే నైతిక హక్కు ఉందా? ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, నిందితుడికి వెంటనే శిక్ష పడేలా చేయాలి. రాష్ట్రంలో దిగజారుతున్న మహిళల భద్రతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అంటూ ఎక్స్‌లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు.

## భూభారతి తెచ్చి రైతుల కష్టాలు పరిష్కరించాం

హైదరాబాద్: గతంలో ప్రజలను పట్టించుకోని నేతలు.. తమకు నీతులు చెబుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ పాలనలో రెవెన్యూ మంత్రి ఏనాడైనా ప్రజలను కలిసారా అని ప్రశ్నించారు. మహబూబాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు పొంగులేటి శంకుస్థాపన చేశారు. కేసముద్రంలో బహిరంగ సభలో మంత్రులు సీతక్క, పొంగులేటి పాల్గొన్నారు. 780 మంది రైతులకు భూధార్ పట్టాదార్ పాస్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఇందిరమ్మ హయాంలోనే 25 లక్షల ఎకరాల భూమి పంచామని, 150 ఎకరాలకు అసైన్డ్ పట్టాలు అడుగుతు న్నారని.. త్వరలోనే అందిస్తామని తెలియజేశారు. భూభారతి తెచ్చి రైతుల కష్టాలు పరిష్కరించామని, మహబూబాబాద్ లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. పరిపాలన అంటే ఇలా ఉండాలని జనం



అనుకుంటున్నారని, పేదోడి కష్టం తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఏ ఎన్నిక వచ్చినా ప్రజాప్రభుత్వాన్నే గెలిపిస్తున్నారని, పేదవాడికి అండగా ఉన్నాం కనుకే ప్రతి ఎన్నికలోనూ గెలిపిస్తున్నారని కొనియాడారు. ఎవరో గగ్గోలు పెడితే తాము పనిచేస్తున్నామని అనుకుంటే అది వారి భ్రమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు.

## గద్వాల రైల్వే శతాబ్ది ఉత్సవాలు జరుపుకుందాం..

గద్వాల రైల్వే స్టేషన్ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గద్వాల రైల్వేస్టేషన్ పనులు పూర్తి చేసి శతాబ్ది ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించుకుందామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.రూ.43 కోట్లతో చేపట్టిన గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణతో పాటు తెలంగాణలో 42 రైల్వే స్టేషన్‌లు ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రూ.43 కోట్లతో గద్వాల రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టినట్టు వివరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్కలేటర్, రెండు లిఫ్టులు, క్యాంటీన్, దివ్యాంగులకు ఆధునిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి చేయడం



జరుగుతుందన్నారు. గద్వాల ప్రాంత అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకమని, ఆధునికీకరణ పనులు పూర్తయిన తర్వాత ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని పేర్కొన్నారు

# సంపాదకీయం

## తెలంగాణ పలుకు.. తేనెలొలుకు!

తెలంగాణ భాష, యాస, అందులోని పలుకుబడులు మన ప్రాంత సంస్కృతికి, చారిత్రక వైభవానికి, ప్రజల జీవన విధానానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి. శతాబ్దాల కాలంగా వివిధ రాచరికాల పాలన, ముఖ్యంగా నిజాం నవాబుల పాలన ప్రభావం వల్ల తెలంగాణ తెలుగు భాషలో ఉర్దూ,పర్షియన్,మరాఠీ,కన్నడ పదాలు సహజంగా కలిసిపోయి,ఒక విలక్షణ మైన రూపాన్ని సంతరించుకున్నాయి.మన తెలంగాణ భాష కేవలం ఒక సంభాషణ మాధ్యమం మాత్రమే కాదు; అది శ్రమజీవుల స్వేదం,ఉనికి,మట్టి వాసన, ఆత్మీయతల కలయిక. తెలంగాణ పలుకుబడుల్లో నిష్కల్మషత్వం తొణికిసలాడుతుంది. ఇక్కడి సామెతలు, పొడుపు కథలు, జాతీయాలు నిత్య జీవితంలోని కష్టసుఖాలను హాస్యాన్ని, వ్యంగాన్ని అద్భుతంగా ప్రతిబింబిస్తాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావ తర్వాత నుంచి కాళోజీ జయంతి రోజైన సెప్టెంబర్ 9న యేటా తెలంగాణ భాషా దినోత్సవం జరుపుకుంటున్నాం.తెలంగాణ రాష్ట్ర సాధనలో భాష ఒక కీలక పాత్ర పోషించింది. ఉద్యమ సందర్భంగా అచ్చమైన తెలంగాణ పలుకుబడిలో కేసీఆర్ చేసిన ప్రసంగాలు తెలంగాణ సమాజాన్ని ఉత్తేజపరిచాయి. సీమాంధ్ర పాలకుల హయాంలో తెలంగాణ పలుకుబడిలో ఎవరైనా మాట్లాడడానికి వెనుకా ముందు ఆడేవారు. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ భాషను ఆయుధంగా చేసుకుని కేసీఆర్ ఉద్యమాన్ని నడిపారు. అచ్చమైన తెలంగాణ భాషలో సాగే కేసీఆర్ ప్రసంగాలు తెలంగాణ ప్రజలను కట్టిపడేశాయి. నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధానంగా ఈ మూడు అంశాలపై ఇక్కడి ప్రజలు ఉద్యమించారు. ఈ మూడే కాదు, తెలంగాణ ఉద్యమానికి బలమైన సాంస్కృతిక కోణం కూడా ఉన్నది. అనేక ప్రత్యేకతలను సొంతం చేసుకున్న తెలంగాణ భాషకు, సాంప్రదాయాలకు సరైన గుర్తింపు లభించడం లేదన్న ఆవేదన దానిలో కలగలిసింది. ప్రత్యేక రాష్ట్రం కోసం సాగిన ఉద్యమంలో తెలంగాణ భాష నిర్వహించిన పాత్ర ప్రత్యేకమైంది.తెలంగాణ భాషలో ఎంతో అర్థవంతమైన పదాలు కనిపిస్తాయి. ఉదాహరణకు మేర అనే పదం.ఇతర ప్రాంతాల వారు దర్జీ అంటారు.ఇది ఉర్దూ నుంచి వచ్చింది.వాస్తవానికి తెలంగాణ లో వాడే మేర పదాన్ని పరిశీలిస్తే పొలిమేర, ఆ మేరకు, ఈ మేరకు అనే మౌఖిక ప్రయోగాలు ఉన్నాయి.మేర అంటే హద్దులని అర్థం. మేరవారు గుడ్డల్ని కత్తిరించి కుట్టేది వ్యక్తి మేరను బట్టే కదా. ఇది అసలు సిసలు తెలుగు పదం.సోయి, సోయిలేదు, సోయినుద్ది, సోయిసెప్పటం లాంటివన్నీతెలుగు పదాలు.తెలంగాణ భాషలో అచ్చమైన తెలుగు పోకడలు చాలా ఉన్నా యి. తెలంగాణ తెలుగులో ఉర్దూ పదాలు అలయ్ బలయ్ కలగలిసిపోవటం కూడా గొప్ప విశేషం. తెలంగాణ తెలుగులో పెద్దపెద్ద సమాసాలు, సంస్కృత పదభూయిష్టమైన తీరుతెన్నులు బహుతక్కువ. నలిమెల భాస్కర్ 'తెలంగాణ పదకోశం'లో అనేక పదాల కూర్పు జరిగింది. తెలంగాణ పద సౌందర్యాన్ని ఆయన పట్టివ్వగలిగారు. 'ఏ భాషకైనా జవజీవాలు జాతీయాలు, సామెతలే.తెలంగాణ వాసుల పలుకు పలుకులో నుడికారం ఉంటుంది. చల్లగా ఉండేది చల్ల (మజ్జిగ), ఎర్రగా ఉండేది ఎర్ర (వానపాము), లాగుతూనే వేసుకునేది లాగు, అంగాన్ని కప్పి ఉంచేది అంగి, కంకుతూ తింటం గనుక కంకి'. ఇలాంటి మాటలెన్నో నలిమెల భాస్కర్ మనమందు ఉంచారు. అదేవిధంగా 'గుమ్మి' అనేది ప్రముఖ తెలంగాణ కథా రచయిత, నవలాకారుడైన డా.కాలువ మల్లయ్య రచించిన ఒక విశిష్టమైన పుస్తకం. ఈ పుస్తకం 'తెలంగాణ వాడుక భాష పలుకుబడులు' అనే అంశంపై రాసినది. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నిత్యం మాట్లాడే విలక్షణమైన పదాలు, సామెతలు, జాతీయాలు, మరుగున పడిపోతున్న పలుకుబడులను ఇందులో పొందుపరిచారు. 'గుమ్మి' అంటే తెలంగాణ పల్లెల్లో ధాన్యాన్ని దాచుకునే పెద్ద బుట్ట లేదా నిల్వ పాత్ర.పల్లె ప్రజల నోట పలికే అమూల్యమైన భాషా పదాలను భద్రపరిచే ఒక నిల్వ పాత్ర లాంటిది కాబట్టే ఈ పుస్తకానికి ఆయన 'గుమ్మి' అని పేరు పెట్టారు.తెలంగాణ ప్రజల భాషలో ఎన్నో పలుకుబడులు నిత్యం తానం ఆడుతాయి. కొన్నింటిని పరిశీలిద్దాం.. ఆన గొట్టి ఎల్సినట్టు (లొల్లి లొల్లి గా ఉండి ఒక్కసారి నిశ్శబ్దం ఆవరిస్తే), సెర్లనీల్లు సెరెనుక వడ్డాయి (అంతా అయిపోయిందని తెలుపటానికి), ఎరుకైందా (నిజాన్ని తెలుపటానికి), ఎప్పటి సిప్ప ఎన్గుల్లే (ఫలితం శూన్యం అయినందుకు), ఏం దెల్వని ఎల్లిపాయె గుర్గలేత్తె కరిగిపాయే (తెలిసే కూడా తెలియనట్లు నటిస్తే), కడ్డుగాడు (కఠినత్వాన్ని తెలుపడానికి), కనికట్టు (ఇంద్రజాలం), కట్రౌతు (కట్టటానికి ఉపయోగించే రాయి), గత్కుడు (తాగటానికి ఉబలాట పడితే), గల్మ (కడప),జప్పున,మెత్త, తంతె.. ఇలాంటివి అనేకం నిత్యజీవితంలో మనం వాడే పదజాలం.తెలంగాణ పలుకుబడుల్లో తెలుగు భాష ప్రాచీన రూపాలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి.ఉదా: తర్వాత అనే పదానికి అటెనక అని, స్పృహ అనే పదానికి సోయి అని వ్యవహరిస్తారు. ఇలాంటి మాటలు శబ్ద సౌందర్యాన్ని, భావ తీవ్రతను అద్భుతంగా వ్యక్తపరుస్తాయి.తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించిన నిజాం పాలన, దక్కని సంస్కృతి కారణంగా మన తెలంగాణ భాషలో చాలా ఉర్దూ, హిందీ పదాలు కలగలిసిపోయాయి. ఉదా: ఆసుపత్రిని ? దవాఖాన, అద్దెను ? కిరాయి, ఇంటి స్థలం ? జాగా వంటివి. ఇంకా అంగడి ?సంత.యాది?జ్ఞాపకం, పెయ్యి ?శరీరం, పత్తా ? చిరునామా, సాలు ? సరిపోవడం, ఎతలు ? కష్టాలు, బువ్వ ?అన్నం,పోరి ?చిన్నపిల్ల, పోరగాడు ? చిన్నపిల్లోడు, తిర్రి?పిచ్చి, పయిలం? జాగ్రత్త వంటి పదాలు ఇక్కడి ప్రత్యేకతను తెలియజేస్తాయి.

# సమస్యలకు సత్వర పరిష్కారం చూపండి

**ప్రజావాణిలో కలెక్టర్ అధికారులకు సూచన**

**గ్రీవెన్స్ లో సమస్యలపై వినతుల వెల్లువ**



భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):ప్రజావాణి వినతులకు ఆయా శాఖల అధికారులు సత్వర పరిష్కారం చూపాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డీఆర్వో పద్మావతి, హౌసింగ్ పీడీ సవయ్ రామ్ తో కలసి స్వీకరించారు. భూ సంబంధిత వివాదాలు రెవెన్యూ అంశాలు సంక్షేమ పథకాల అమలు ఉపాధి పెన్షన్లు గృహాలు మౌలిక వసతులు సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ప్రభుత్వం కల్పించిన ముఖ్యమైన వేదిక అని అన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో ప్రజల సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ పరిష్కార స్థితిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా స్పందించి ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించాలని తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ప్రతీ మండల ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలోనే ప్రజలు తమ సమస్యలు వినతులను మండల ఎంపీడీఓ ఆధ్వర్యంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందే అవకాశం ఉందన్నారు. ప్రజలందరు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు తమ వినతులతో పాటు సమస్యకు సంబంధించిన అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రతి అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# కరాటేలో సత్తాచాటిన సిద్ధు నాయక్

**రాష్ట్రస్థాయి పోటీల్లో సువర్ణ పతకం..**

**జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించడమే లక్ష్యం**

**ప్రభుత్వ ప్రోత్సాహం అందితే మరింత ఉన్నత స్థాయికి ఎదుగుతానంటున్న యువ క్రీడాకారుడు**

జ్యోతి ప్రభంజనం, హైదరాబాద్ ప్రతినిధి, ఆగస్టు 31:క్రీడారంగంలో ప్రతిభకు కొదవలేదని మరోసారి నిరూపిస్తూ చంపాపేట్‌కు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎన్. సిద్ధు నాయక్ కరాటే పోటీల్లో సత్తాచాటాడు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న సిద్ధు నాయక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడు.చంపాపేట్‌లోని శ్రీ వెంకటేశ్వర కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సిద్ధు నాయక్, చదువుతో పాటు



క్రీడలపై ప్రత్యేక ఆసక్తి పెంచుకుని కరాటేలో కఠోర సాధన చేస్తున్నాడు. పోటీలో ప్రత్యర్థులను దీటుగా ఎదుర్కొని తన ప్రతిభను ప్రదర్శించి సువర్ణ పతకాన్ని కైవసం చేసుకోవడం పట్ల కుటుంబ సభ్యులు, కళాశాల అధ్యాపకులు, స్నేహితులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.క్రీడాకారుడిగా ఎదగాలన్న పట్టుదలసిద్ధు నాయక్అఖిల భారతీయ బంజారా మహా సేవ సంఘం బంజారా భారత్తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు,యాకత్ పురా నియోజకవర్గం కు చెందిన జనసేన పార్టీ నాయకుడు నేనావాత్ సీతారాం నాయక్ కుమారుడు. చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకున్న సిద్ధు నాయక్ కరాటేలో మంచి నైపుణ్యాన్ని సంపాదించేందుకు నిరంతరం సాధన చేస్తున్నాడు. ఎన్ని సవాళ్లు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగుతూ క్రీడారంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నాడు.కరాటేలో సాధించిన గోల్డ్ మెడల్ తనకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులో జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ, ప్రపంచ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని ఛాంపియన్‌గా నిలవడమే తన ప్రధాన లక్ష్యమని సిద్ధు నాయక్ చెబుతున్నాడు.ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తే మరింత ప్రతిభప్రతిభ ఉన్న ఎంతోమంది యువ క్రీడాకారులు ఆర్థిక ఇబ్బందులు, సరైన శిక్షణ, క్రీడా సామగ్రి, పోటీ అవకాశాల కొరత కారణంగా వెనుకబడుతున్నారని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. సిద్ధు నాయక్‌కు ప్రభుత్వం తరఫున అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ, క్రీడా సౌకర్యాలు, ఆర్థిక సహాయం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబరిచే అవకాశం ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రోత్సాహం కల్పించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వపరంగా అండగా నిలవాలని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు."ప్రోత్సాహం ఉంటే ప్రపంచ స్థాయిలో మెరుస్తా"కరాటేలో గోల్డ్ మెడల్ సాధించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో మరింత కష్టపడి సాధన చేస్తాను. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి, ఆ తర్వాత అంతర్జాతీయ, ప్రపంచ స్థాయి పోటీల్లో ఛాంపియన్‌గా నిలవాలన్నదే నా లక్ష్యం. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం, శిక్షణ, స్పోర్ట్స్ కోటా ద్వారా సహకారం లభిస్తే నా లక్ష్యాన్ని సాధించేందుకు మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతాను" అని కరాటే విజేత ఎన్. సిద్ధు నాయక్ పేర్కొన్నాడు.ప్రతిభను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేయువతలో క్రీడా ప్రతిభను గుర్తించి చిన్న వయసులోనే ప్రోత్సహిస్తే భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి అనేక పతకాలు సాధించే క్రీడాకారులు తయారవుతారని స్థానికులు పేర్కొంటున్నారు. కేవలం పోటీల్లో పతకాలు సాధించిన అనంతరం అభినందించడం కాకుండా, ప్రతిభావంతులైన క్రీడాకారుల శిక్షణ, ప్రయాణ ఖర్చులు, క్రీడా సామగ్రి, ఉన్నత స్థాయి కోచింగ్, పోటీల్లో పాల్గొనే అవకాశాలకు ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరుతున్నారు.ప్రతిభకు పట్టుదల తోడైతే విజయం తప్పదు.. ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తే ఆ విజయం జాతీయ సరిహద్దులు దాటి ప్రపంచ వేదికపై మెరిసే అవకాశం ఉంటుంది" అని సిద్ధు నాయక్ ప్రతిభను అభినందించిన వారు పేర్కొన్నారు.కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన ఎన్. సిద్ధు నాయక్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కుటుంబ సభ్యులు, కళాశాల అధ్యాపకులు, స్నేహితులు, స్థానికులు ఆకాంక్షించారు.

# మహా పర్వదినం

మంచి రోజులని క్యాలెండర్ చూడకు
మంచి గడియని పంచాంగం చూడకు
నువ్వు బ్రతికి ఉండడమే



ఒక మహా పర్వదినమని భావించు
నిన్నటి బాధలను తలచుకొని
ఈరోజును బాధ పెట్టుకోకు
రేపటి భయాలతో
ఈరోజు ఆనందాన్ని చంపుకోకు
నీ ఊపిరి నడుస్తున్నంత వరకు
ప్రతి క్షణం ఒక వరమే
నీ గుండె కొట్టుకుంటున్నంత వరకు
ప్రతి రోజు ఒక పండుగే
కాలం కలిసిరాలేదనినీ
జీవితాన్ని నిందించకు
కష్టాలు ఎదురొచ్చాయనినీ
అడుగులను ఆపకు
చీకటి ఎంతసేపున్నా
వెలుగు రాకుండా ఉండదు
నీ ఓర్పు ఎంత పరీక్షించినా
విజయం నిన్ను విడిచిపోదు
నీ చేతిలో ఉన్న ఈరోజును
నీకు నచ్చినట్టుగా జీవించు
నీతో ఉన్న మనుషులను
మనస్ఫూర్తిగా ప్రేమించు
రేపటి ముహూర్తం కోసం
ఈరోజు జీవితాన్ని వాయిదా వేయకు
బ్రతుకు ఉన్నప్పుడే బ్రతుకు
ఎందుకంటే...
మనిషి వెళ్లిపోయిన తర్వాత
ఎన్ని శుభగడియలు వచ్చినా
అవి అతని జీవితాన్ని మార్చలేవు
అందుకే...
క్యాలెండర్ కాదు... నీ జీవితం చూసుకో
పంచాంగం కాదు... నీ గుండె మాట విను
నువ్వు బ్రతికి ఉన్న ప్రతి క్షణమే
నీ జీవితానికి అసలైన మహా పర్వదినం!

రచన : కె.మురళీ మోహన్ రాజు,
నెల్లూరు.చరవాణి : 9866179385

# పేదల సంక్షేమం సంతోషమే లక్ష్యం మాజీ మంత్రి

సికింద్రాబాద్, జ్యోతి ప్రభంజనం :పేద ప్రజలు సంతోషంగా ఉండాలని తాను ఎల్లప్పుడూ కోరుకుంటానని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం పద్మారావు నగర్ లోని హమాలీ బస్తీ లో గల కమిటీ హాల్ పై సీల్ వెల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన షెడ్డును ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సీల్ వెల్ సంస్థ అధినేత బండారు సుబ్బారావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు నగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బస్తీ వాసులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను, బండారు సుబ్బారావు ను ఘనంగా సన్మానించి తమ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు అత్యధికంగానివసించే హమాలీ బస్తీ ప్రజలకుఏ అవసరమొచ్చినాతాను అన్ని వేళలా అండగా నిలుస్తూ వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. బస్తీ ప్రజలు చిన్న చిన్న ఫంక్షన్ లను చేసుకునేందుకు ఎలాంటి ఆర్థికభారం పడొద్దనే ఆలోచనతోనే కమిటీ హాల్ ను నిర్మించడం జరిగిందని చెప్పారు.అదేవిధంగా ఫంక్షన్ లకు అవసరమైన వంట సామగ్రి ని కూడా అందించామని చెప్పారు. ఆ వంట సామాగ్రినిభద్రపర్చడానికే బండారు సుబ్బారావు సహకారంతో నూతనంగా రేకుల షెడ్డును నిర్మించినట్లు తెలిపారు.ఇవే కాకుండా బస్తీలో రోడ్లు,డ్రైనేజీ, త్రాగునీరు వంటి అనేక సమస్యలు పరిష్కరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. బస్తీ వాసులు కలిసికట్టుగా ఉండాలని,ఇంకా సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

# మాజీ ఎమ్మెల్యే రఘువీరారెడ్డి సోదరుడు డా. నీలకంఠాపురం జయరాం మృతి



కళ్యాణదుర్గం: జ్యోతి ప్రభంజనం ప్రతినిధి కళ్యాణదుర్గం మాజీ శాసనసభ్యుల యన్ రఘువీరారెడ్డి పెద్ద సోదరుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ నీలకంఠాపురం జయరాం ఆదివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులతో పాటు నీలకంఠాపురం గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.డాక్టర్‌గా విదేశాలలో సుమారు 45 సంవత్సరాల పాటు నిస్వార్థ సేవలందించిన జయరాం గారు, సొంత గడ్డపై మమకారంతో తన గ్రామానికి విశేష సేవలందించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన నేత్ర వైద్యం అందించాలనే ఉన్నత సంకల్పంతో నీలకంఠాపురంలో 'శాంతా జయరాం ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి మరియు రీసెర్చ్ సెంటర్'ను స్థాపించారు. ఈ కేంద్రం ద్వారా వేలాది మంది పేదలకు ఉచితంగా, నాణ్యమైన కంటి వైద్య సేవలు అందేలా చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు.ఆయన మరణం కుటుంబానికే కాకుండా, నీలకంఠాపురం గ్రామ ప్రజలకు, ఆయన వద్ద వైద్య సేవలు పొందిన వేలాది మంది బాధితులకు తీరని లోటని స్థానికులు, పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# శ్రీకృష్ణుని గోపుర నిర్మాణానికి విరాళం

**పారిశ్రామికవేత్త జీకే కృష్ణమూర్తిని కోరిన తెనగల్లు గ్రామస్తులు**



అనంతపురం,జ్యోతి ప్రభంజనం, ఆగస్టు, 31: అనంతపురం గ్రామంలోని శ్రీకృష్ణ ఆలయ గోపుర నిర్మాణానికి విరాళం అందించాలని తెనగల్లు గ్రామస్తులు పారిశ్రామికవేత్త జీకే కృష్ణమూర్తిని కోరారు. ఆలయ గోపుర నిర్మాణం చేపట్టేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారని, అందుకు దాతల సహకారం అవసరమని తెలిపారు.ఈ సందర్భంగా జీకే కృష్ణమూర్తిని కలిసి ఆలయ అభివృద్ధి, గోపుర నిర్మాణం తదితర విషయాలను వివరించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే శ్రీకృష్ణ ఆలయ గోపుర నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెనగల్లు గ్రామస్తులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిలు విడుదల చేయాలి

చిట్యాల,నల్లగొండ: ఆగస్టు 31(జ్యోతి ప్రభంజనం): విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని నకిరేకల్ నియోజకవర్గ డివిజన్ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు అర్రూరి ప్రణీత్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని




కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం చిట్యాలలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా అర్రూరి ప్రణీత్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు చదువులు కొనసాగించేందుకు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడం తగదని అన్నారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కన్వీనర్ చందు, కో-కన్వీనర్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# కోడలు తెచ్చిన కట్నం

గతంలో నువ్వు వరకట్నంగా



ఏమి తీసుకొని వచ్చావని
కొత్త కోడలు దగ్గర అడిగే
ఈ పాడు సమాజం...
తాను ఏమేమి కోల్పోయి
అన్నీ వదులుకొని వచ్చిందో
ఇప్పుడు నీకు గుర్తుకురాదా..?
పుట్టింటి ప్రేమను వదిలి
అమ్మానాన్నల ఒడిని వదిలి
అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని వదిలి
తన బాల్య జ్ఞాపకాలను వదిలి
నీ ఇంటి గడప తొక్కింది...
కట్టుకున్న బంధాలను వదిలి
కొత్త బంధాలకు ప్రాణం పోయడానికి
తన జీవితాన్నే పణంగా పెట్టింది
అయినా ఆమె తెచ్చింది
కట్నం ఎంత అని లెక్కలు వేస్తావా..?
ఆమె తెచ్చిన నగలు కాదు
ఆమె తెచ్చిన నగదు కాదు
నీ ఇంటిని నిలబెట్టే ఓపిక తెచ్చింది
నీ కుటుంబాన్ని కలిపే ప్రేమ తెచ్చింది
నీ జీవితాన్ని నడిపే తోడు తెచ్చింది...
కోడలు అంటే కట్నం కాదు
కోడలు అంటే ఓ మనిషి
ఆమెను వస్తువుగా చూడకు
ఆమె త్యాగాన్ని తక్కువ చేయకు
ఆమె గుండెను గాయపరచకు...
ఆమె నవ్వితేనే ఆ ఇంటికి వెలుగు
ఆమె సంతోషమే ఆ ఇంటి సంపద
కట్నంతో కాదు... గౌరవంతో
కోడలిని ఇంటి మనిషిగా చూసినప్పుడే
ఆ కుటుంబం నిజమైన కుటుంబమవుతుంది.

రచన : రేవెల్లి పద్మశివాని జూనియర్ కాలేజ్, హన్మకొండ.

# సువాసిని రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వీరేశం.

చిట్యాల, నల్లగొండ: ఆగస్టు 31(జ్యోతి ప్రభంజనం):చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన సువాసిని రెడ్డి నేపాల్



పర్యటనకు వెళ్లి ఆకస్మిక వరదల్లో చిక్కుకున్న విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆమె కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సువాసిని రెడ్డి వరదల్లో చిక్కుకున్న పరిస్థితిపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే వీరేశం, సువాసిని రెడ్డి క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఆమెను సురక్షితంగా స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కాటనీ వెంకటేశం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జడల చిన్న మల్లయ్య, ఓర్సు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# లాక్రోస్‌లో భారత మహిళల జట్టుకు కాంస్య పతకం

**సత్తా చాటిన చిట్యాల క్రీడాకారిణి సంగీత.. నల్లగొండకు చెందిన గోపిక.**

చిట్యాల,నల్లగొండ: ఆగస్టు 31(జ్యోతి ప్రభంజనం): మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఆగస్టు 28 నుంచి 30వ తేదీ వరకు జరిగిన దక్షిణ-తూర్పు ఆసియా లాక్రోస్ ఛాంపియన్‌షిప్?2026-27 పోటీల్లో భారత మహిళల జట్టు కాంస్య పతకాన్ని సాధించింది. ఈ విషయాన్ని తెలంగాణ లాక్రోస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.డి. లతీఫుద్దీన్, జనరల్ సెక్రటరీ కె. బానుచందర్, కోచ్ ఏ. శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత మహిళల జట్టు తరఫున తెలంగాణకు చెందిన ఇద్దరు క్రీడాకారిణులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన చిర్రబోయిన సంగీత, నల్లగొండకు చెందిన గోపిక భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో దేశం తరపున బరిలోకి దిగి జట్టు కాంస్య పతకంనీ సాధించడంలో భాగస్వాములు కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.క్రీడల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని ఈ విజయం మరోసారి నిరూపించింది. చిట్యాల ప్రాంతానికి చెందిన సంగీత అంతర్జాతీయ వేదికపై భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం పట్ల స్థానికులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.నల్లగొండ జిల్లాకు చెందిన క్రీడాకారిణులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని పలువురు క్రీడాకారులు, ప్రజలు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని దేశానికి, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.



# బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా కంబాలపల్లి సతీష్‌కుమార్ యాదవ్ ప్రమాణ స్వీకారం.

చిట్యాల,నల్లగొండ: ఆగస్టు 31(జ్యోతి ప్రభంజనం):చిట్యాల పట్టణానికి చెందిన కంబాలపల్లి సతీష్‌కుమార్ యాదవ్ బీజేవైఎం (భారతీయ జనతా యువమోర్చా) నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన చిట్యాల శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీజేపీ నాయకులు, కార్యకర్తలు సతీష్‌కుమార్ యాదవ్‌ను శాలువాతో సన్మానించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నకిరెకంటి మొగులయ్య మాట్లాడుతూ చిట్యాలకు చెందిన సతీష్‌కుమార్ యాదవ్ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం పట్టణానికి, యువతకు గర్వకారణమన్నారు. పార్టీ బలోపేతానికి, యువతను సంఘటితం చేయడానికి ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. యువత సమస్యలపై చురుగ్గా స్పందిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌తో పాటు పార్టీ నాయకులు సతీష్‌కుమార్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన ఆయన నాయకత్వంలో బీజేవైఎం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రుద్రవరం లింగస్వామి, మాస శ్రీనివాస్, కన్నెబోయిన మహాలింగం, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గంజి గోవర్ధన్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కూరెళ్ల శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు జయరాపు రామకృష్ణ, కూరెళ్ల శ్రీనివాస్, పల్లె వెంకన్న, కాంచర్ల శంకర్‌రెడ్డితో పాటు బీజేపీ, బీజేవైఎం రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ కార్యాలయంపై దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ

నల్గొండ జిల్లా,జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు 31:తెలంగాణ భారతీయ జనతా పార్టీ కార్యాలయంపై అదే విదంగా నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయం పైన నాగం వర్షిత్ రెడ్డి జిల్లా అధ్యక్షులు ఇంటి పైన కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిది నారోజు కుమారస్వామి అన్నారు.ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు సహజమని, అయితే ఆ భిన్నాభిప్రాయాలను చర్చలు, ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా వ్యక్తం చేయాలి తప్ప దాడులు, విధ్వంసాలకు పాల్పడటం ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు.రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులకు దిగడం కాంగ్రెస్ పార్టీ అసహనానికి నిదర్శనం. అధికారంలో ఉన్న పార్టీ కార్యకర్తలే ఇలాంటి చర్యలకు పాల్పడితే సామాన్య ప్రజలకు ఎలాంటి సందేశం వెళ్తుంది?'' అని ప్రశ్నించారు.తెలంగాణ గడ్డపై ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందన్నారు. బీజేపీ కార్యాలయంపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.దాడులు, బెదిరింపులతో బీజేపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టడం సాధ్యం కాదు. ప్రజాస్వామ్య విలువలు, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ తన పోరాటాన్ని మరింత బలంగా కొనసాగిస్తుంది” అని నారోజు కుమారస్వామి బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి స్పష్టం చేశారు.



# తుర్కు యూనివర్సిటీలో శిక్షణ పూర్తి చేసిన ఉపాధ్యాయుడు

బుచ్చిరెడ్డి పాలెం, జ్యోతి ప్రభంజనం, ఆగస్టు 31:బుచ్చిరెడ్డి పాలెం మండలం పెనుబల్లి పాఠశాల ఉపాధ్యాయుడు డాక్టర్ చీదరాల చెన్నయ్య యూరప్ ఖండం ఫిన్లాండ్ దేశంలోని తుర్కు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. త్రు "జాయ్ అండ్ ప్లే " అనే పేరుతో బాల్య దశ, ప్రాథమిక విద్యలో వృత్తిపరమైన శిక్షణా కార్యక్రమాన్ని ఆగష్టు 17 వ తేది నుంచి 26 తేది వరకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు డాక్టర్ చీదరాల చెన్నయ్య శిక్షణా ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఫిన్లాండ్ దేశంలో ప్రాథమిక విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇక్కడ మాతృ భాష లోనే విద్యను అందిస్తున్నారని అలాగే ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు కళలు, క్రీడలు, అభ్యసనా నైపుణ్య పాఠాలను భోధిస్తున్నారని, ఈశిక్షణా కార్యక్రమం మన విద్యా విధాన అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా కమీషనర్ తమీమ్



అన్సారియా, సువి పువోలక్కా, ప్రాథమిక విద్యా విభాగ ప్రధానాచార్యులు రౌమా టీచర్ ట్రైనింగ్ స్కూల్, తుర్కు విశ్వవిద్యాలయం విద్యా విభాగధిపతులు ఆరి, సారీ ఐసోక్యోటో, శింజొయ్ తదితరులు పాల్గొన్నారు.

# కరాటేతోనే ఆత్మరక్షణ, అద్భుత మానసిక వికాసం

### ఘనంగా ముగిసిన యోధ గోజ్యుర్యూ బెల్ట్ పరీక్షలు
### మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలతో అదరగొట్టిన క్రీడాకారులు

రంగారెడ్డి, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు 31:ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు బెల్టులు, ప్రశంసా పత్రాల ప్రదానం హైదరాబాద్, నగరంలో యోధ గోజ్యుర్యూ కరాటే దు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ పరీక్షలు ఆదివారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. కరాటే మాస్టర్ డి. కిరణ్ కుమార్ పర్యవేక్షణలో కఠిన శిక్షణ పొందిన పలువురు క్రీడాకారులు ఈ పరీక్షల్లో పాల్గొని, తమ మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలను అద్భుతంగా ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ వేడుకకు యోధ గోజ్యుర్యూ స్పోర్ట్స్ దు ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా "గ్రాండ్ మాస్టర్ జి. విట్టల్" ముఖ్య అతిథిగా విచ్చేసి, పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బెల్టులు మరియు ప్రశంసా పత్రాలను (సర్టిఫికెట్లను) ప్రదానం చేశారు. కరాటేతోనే స్వయం రక్షణ (ఆత్మరక్షణ):ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ జి. విట్టల్ మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా కరాటే నేర్చుకోవడం ద్వారా స్వయం రక్షణ లభించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, మరియు మానసిక వికాసం పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే ఇలాంటి యుద్ధ విద్యల్లో శిక్షణ పొందడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. ఘనంగా అభినందనలు:కార్యక్రమంలో భాగంగా ప్రతిభ చాటిన





క్రీడాకారులను మాస్టర్ ఆర్. విజయ్ కుమార్, మాస్టర్ పి. మనీష్ కుమార్, రవి కుమార్ తదితరులురిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ అద్భుత ప్రదర్శనను వీక్షించేందుకు క్రీడాకారుల తల్లిదండ్రులు, మార్షల్ ఆర్ట్స్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గాంధీ, బసవతారకం ఆస్పత్రుల వద్ద పేదలకు 'రెడీ టూ సర్వ్' ఫౌండేషన్ అన్నప్రసాద వితరణ

### ఐత అనూప్ చక్రవర్తి జన్మదినం సందర్భంగా సేవ

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, ఆగస్టు 31:గాంధీ, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రుల వద్ద రెడీ టూ సర్వ్ ఫౌండేషన్, ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి వద్ద చికిత్స కోసం వచ్చిన పేద రోగులు, వారి కుటుంబ సభ్యులు, అవసరమైన వారికి రెండు చోట్ల సుమారు వెయ్యి మందికి ఉచితంగా భోజనం పంపిణీ చేశారు. టీటీడీ దేవస్థానం మాజీ ఎల్ఏసీ మెంబర్, శ్రీమాన్ గ్రూప్ ఎండీ ఐత అనూప్ చక్రవర్తి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సేవా కార్యక్రమంలో పలువురు స్వచ్ఛందంగా వాలంటీర్లుగా పాల్గొని, స్వయంగా ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందిస్తూ వందలాది మందికి ఆహారం అందించారు. సమాజంలో ఆకలితో బాధపడుతున్న వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పేద ప్రజల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించనున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రుల వద్ద చికిత్స కోసం నిరీక్షించే పేద రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఈ అన్నదానం ఎంతో ఉపయోగకరంగా మారిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. 'రెడీ టూ సర్వ్' ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా




ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ మాట్లాడుతూ, సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే దాతలు, స్వచ్ఛంద సేవకులు తమను సంప్రదించాలని కోరారు. సమాజ సేవలో మరింత మంది భాగస్వాములు కావడం ద్వారా అవసరమైన వారికి మరింత విస్తృతంగా సహాయం అందించగలమని ఆయన పేర్కొన్నారు.

# గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

### ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి
### ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ సూచన

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ప్రజలకు ఇబ్బంది కలుగకుండా మతసామరస్యాన్ని పాటించి శాంతియుతంగా జయప్రదంగా జరిగే విధంగా చూడాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు. భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశం స్థానిక చుంచుపల్లిలోని సోమవారం సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ లౌకికవాదిగా తాను అన్ని మతాలను మత సంస్కృతులను గౌరవిస్తానని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో చందాల దందాలను బలవంతపు వసూళ్లను చేయకుండా ప్రేమతో గౌరవంతో ఇచ్చిన విరాళాన్ని స్వీకరించాలన్నారు. ఒక వీధిలో ఒకే విగ్రహాన్ని నెలకొల్పి ఆ వీధిలో వాహనదారులకు మార్గాన్ని తప్పకుండా చూపించాలన్నారు. అంతేగాని ఒక వీధిలో మూడు నాలుగు విగ్రహాలు పెట్టి ఆ మార్గాన్ని మూసి వెయ్యరాదన్నారు. రహదారి కూడళ్లలో(జంక్షన్స్) ఎట్టి పరిస్థితిలోనూ విగ్రహాలను నెలకొల్ప రాదని సూచించారు. దయచేసి డీజే సౌండ్ సిస్టంను మండపాల వద్ద నిషేదించాలన్నారు. ఎందుకంటే బలహీనమైన ఆరోగ్యం గలవారు ఈ పెద్ద సౌండ్ పొల్యూషన్ తో గుండె ఆగి చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మామూలు సౌండ్ తో ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేశుని మండపాల వద్ద పవిత్రమైన ఆత్మీయమైన భక్తి ప్రపత్తులతో కూడిన వాతావరణాన్ని కలిగించాలన్నారు. అంతేగానీ ఉద్రిక్త



గొడవలతో కూడిన వాతావరణం గాని నివారించాలని సూచించారు. నిమజ్జనం రోజున ట్రాఫిక్కును నియంత్రణ చేసి ఏ ఏరియా విగ్రహాలను ఏ మార్గాలలో డైవర్ట్ చేయాలో ఒక ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలన్నారు. పై సూచనలను మార్గదర్శక సూత్రాలను,అమలుపరిచేటట్లుగా గణేష్ నవరాత్రి ఉత్సవాల కమిటీ సభ్యులు పోలీస్ అధికారులు అప్రమత్తమై తగు చర్యలు తీసుకోవాలని ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం అత్యవసర సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, జిల్లా అధ్యక్షులు మచ్చ పృథ్వీరాజ్, భారతరత్న అంబెద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూపతి అశోక్, జిల్లా నాయకులు రాజేశ్వరరావు, శ్రీనివాస్, విజయరాజు, సంతోష్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి

### మంచినీటి పారిశుద్ధ్య సమస్యకు పరిష్కారం లేదు
### కోతులు వీధి కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలి
### సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు
### ప్రజా సమస్యలపై కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):డివిజన్లో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటుగా ప్రధాన సమస్యలైన మంచినీటి పారిశుద్ధ్య సమస్యకు పరిష్కారం చూపాలని కోతులు వీధి కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని సిపిఎం




టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటు అయిన తర్వాత అభివృద్ధి పరుగులు పెట్టడం లేదని పూర్తిగా కుంటు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెంలో ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఆరోపించారు. అంతర్గత రోడ్లు డ్రైనేజీలు సక్రమంగా లేక ప్రజల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత సంవత్సరం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేసి కిన్నెరసాని మంచినీరు ప్రతిరోజు ఇవ్వాలి అని అధికారులకు మొరపెట్టుకుంటే ఆరు నెలల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి నేటికీ సంవత్సరం పూర్తి అవుతున్న కిన్నెరసాని నీళ్లు మాత్రం చుట్టం చూపున వస్తున్నాయని ఎద్దేవా చేశారు. అమృత్ భారత్ పథకం కింద ఇంటింటికి మంచినీటి నల్ల సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చి నేటికీ రెండు సంవత్సరాలు అవుతున్న ప్రజలకు అమృత భారతి స్కీం నీళ్లు రావడంలేదని అలాగే గత ప్రభుత్వం ప్రారంభించిన మిషన్ భగీరథ పనులు కూడా పూర్తి కాలేదని ఆరోపించారు. పాలకులు మారుతున్న కొత్తగూడెం పట్టణ ప్రజల మంచినీటి సమస్య పరిష్కారం కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కూడా మంచినీళ్ల అందించలేని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత మున్సిపాలిటీలోనే కోతులు కుక్కలను పట్టించడానికి బడ్జెట్ కేటాయించామని ప్రకటనలు చేసి వదిలేసారని విమర్శించారు. కోతులు కుక్కల బెడద వలన ప్రజలు బయటికి రావాలంటే భయపడుతున్నారని తెలిపారు. అభివృద్ధి ప్రకటనలు మాటల్లో కాకుండా ఆచరణలో చూపించాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇల్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల స్థానిక సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్పొరేషన్ కమిషనర్ సుజాతకి వినతి పత్రం...ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ సుజాతకు సిపిఎం బృందం వినతిపత్రం అందించింది. స్పందించిన కమిషనర్ పాఠశాలలకు మిషన్ భగీరథ పైప్లైన్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పాత కొత్తగూడెం సింగరేణి మెయిన్ హాస్పిటల్ నుండి సెవెన్ హిల్స్ వరకు రోడ్డు నిర్మాణానికి కౌన్సిల్ తీర్మానం చేస్తామని హామీ ఇచ్చారు. వీధి కుక్కలను పట్టించి ప్రజలను కాపాడుతామని హామీ ఇచ్చారు. ఆరు నెలల్లో కిన్నెరసాని మంచినీటి సమస్య పరిష్కారం మిషన్ భగీరథ పైప్లైన్ ద్వారా నీళు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యురాలు సందకూరి లక్ష్మి నాయకులు కే హెచ్ ప్రసాద్ ఎంఎస్ ప్రకాష్ కొలిపాక వెంకటేశ్వర్లు ధనియాకుల శివ ఎస్.కె సాహెబి బాలకృష్ణ రాములు రఘు నిహారిక భారతమ్మ పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**